
ప్రజాశక్తి
శనివారం 12 ఏప్రిల్ 2025
పార్వతీపురం మన్యం



ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్ష 21కు వాయిదా

ప్రజాశక్తి - భామిని

స్థానిక ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతిలో ప్రవేశానికి ఈనెల 20న నిర్వహించబోయే పరీక్షను ఈస్టర్ పండుగ కారణంగా ప్రభుత్వం వాయిదా వేసినట్టు ఆ పాఠశాల ప్రిన్సిపల్ రఘుపాత్రుని శివకుమార్ తెలిపారు. ఈ పరీక్షను మరుసటి రోజు అనగా ఈనెల 21న స్థానిక ఆదర్శ పాఠశాలలో ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. పరీక్ష తేదీ మార్పును విద్యార్థులు గమనించి ఆరో తరగతి ప్రవేశ పరీక్షకు హాజరు కావాలని ఆయన కోరారు.

బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి పూలే

ప్రజాశక్తి - పార్వతీపురం

బడుగు, బలహీనవర్గాల ఆశా జ్యోతి మహాత్మా జ్యోతిబా పూలేనని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ పూలే 199వ జయంతి వేడుకలు బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. తొలుత ఈ కార్యక్రమానికి మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొని కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పూలే విగ్రహానికి కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్, జెసి ఎస్.ఎస్.శోబిక, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవతో కలిసి పూలమాలలను వేసి నివాళులు అర్పించారు. అనంతరం సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన పూలే చిత్రపటానికి పూలమాలను వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ డాక్టర్ బాబు జగ్గీవన్ రామ్, జ్యోతీరావు పూలే, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ వంటి మహనీయులను ఈ మాసంలో స్మరించుకొని జయంతి ఉత్సవాలను నిర్వహించుకోవడం గర్వకారణమని అన్నారు. గాంధీ తర్వాత మహాత్మా బిరుదును పొందిన మహోన్నత వ్యక్తి పూలే అని ప్రశంసించారు. ఆయన ఆశయాలు, సిద్ధాంతాలు, క్రమశిక్షణ ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవల్సిన తరుణమిదని పేర్కొన్నారు. బిసిల పాలిట ఆరాధ్య దైవం అయ్యారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా బిసిల సంక్షేమం, అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. బిసిల్లోని వివిధ కులవృత్తుల వారి కోసం ఆదరణ పథకాన్ని పునరుద్దరించి పనిముట్లు ఇచ్చే కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు చెప్పారు. పిఎంఎవై పథకం కింద చేపట్టే గృహ నిర్మాణాలకు బిసి లబ్ధిదారులకు అదనంగా రూ.50వేలు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. స్వయం ఉపాధి కింద బిసి కార్పొరేషన్ ద్వారా రూ.900 కోట్ల రుణాలను మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. అలాగే 50 శాతం సబ్సిడీతో ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకాన్ని అందుబాటులోకి తీసుకువచ్చామని, ఈ పథకాన్ని అందరూ వినియోగించుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. బిసి సంక్షేమ వసతి గృహాలన్నింటినీ అందంగా తీర్చిదిద్దేందుకు నిధులు కేటాయించినట్లు చెప్పారు. జిల్లాలో 2,929 మంది బీసీ లబ్ధిదారులకు రూ.35 కోట్ల మేర రుణాలను అందిస్తున్నామన్నారు. అనంతరం 124 మంది లబ్ధిదారులకు రూ.2కోట్ల 71 లక్షల 50వేల మెగా చెక్కును, వ్యవసాయ, ఇతర పనిముట్లను మంత్రి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. పీఎంఈజీపి కింద రూ.15 లక్షలు విలువ గల బొలొరా వాహనం, డిజె సౌండ్ సిస్టంను, రూ. లక్ష విలువైన ఆవును, రూ.50వేల విలువ గల కుట్టు మిషనును మంత్రి లబ్ధిదారులకు అందజేసారు.

అనంతరం కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ ఆ రోజుల్లోనే నిరక్షరాస్యత ఉండరాదని ఆలోచన చేసిన మహోన్నత వ్యక్తి జ్యోతిరావు పూలే అని కొనియాడారు. మగవారితో పాటు స్త్రీలకు కూడా చదువు ఉండాలని, వారి కోసం ప్రత్యేకంగా పాఠశాలను ఏర్పాటు చేసిన ఘనత ఆయనకే దక్కుతుందని తెలిపారు. వితంతు పునర్వివాహాలను ప్రోత్సహించి దేశంలోనే తొలిసారిగా బాలహత్య ప్రతిబంధక్ గృహ కేంద్రాన్ని స్థాపించి, వితంతువులకు, గర్భిణులకు అండగా నిలిచారన్నారు. అలాగే దేశంలోనే తొలిసారిగా సత్య శోధక సమాజాన్ని స్థాపించి, సంస్కరణోద్యమాన్ని చేపట్టి, కుల, మత వివక్ష లేకుండా ప్రతి ఒక్కరికి సభ్యత్వం కల్పించారని కలెక్టర్ గుర్తుచేసారు. పూలే ప్రతి రోజూ పుస్తక పఠనం చేసేవారని, ఆయన స్ఫూర్తితో నేటి విద్యార్థులంతా పుస్తక



నివాళ్లు అర్పిస్తున్న మంత్రి సంధ్యారాణి, కలెక్టర్, అధికారులు

పఠనం అలవర్చుకొని ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. జిల్లాలో 14 బీసీ సంక్షేమ వసతి గృహాలుండగా, వాటికి మరమ్మతులకు నిధులు మంజూరయ్యాయని అన్నారు. అలాగే బీసీ విద్యార్థులకు డిఎస్సీ కోచింగ్, ఉపకార వేతనాలు, జీవనోపాధుల నిమిత్తం రూ.247 కోట్ల నిధులను మంజూరు చేయనున్నట్లు కలెక్టర్ వివరించారు. వ్యవసాయ రంగంలో కూడా బీసీలు అభివద్ధి చెందాలని రూ.10 కోట్ల విలువ గల ఆధునిక వ్యవసాయ పనిముట్లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. పూలే చూపిన బాటలో యువత ముందుకు సాగాలని, భవిష్యత్ తరాలకు మార్గదర్శకంగా ఉండాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర మాట్లాడుతూ బీసీలు తలెత్తుకునేలా తిరుగుతున్నారంటే అది పూలే కృషి ఫలితమేనని గుర్తుచేశారు.

బిసిల సంక్షేమానికి పెద్దపీట : మంత్రి సంధ్యారాణి

మహిళలకు విద్య ఉండాలని, ఆ రోజుల్లోనే ప్రత్యేకంగా మహిళా పాఠశాలను ప్రారంభించారని అన్నారు. మహిళలకు కుట్టుమిషన్లు, టైలరింగులో శిక్షణ వంటి వివిధ కార్యక్రమాలను చేపట్టి ప్రపంచానికి పోటీగా బీసీలను నిలబెట్టేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే వివరించారు. జెసి ఎస్ఎస్ శోబిక, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ మాట్లాడుతూ బిసిల అభ్యున్నతికి పూలే చేసిన కృషిని కొనియాడారు. మహిళలకు విద్య, హక్కుల కోసం ఆ రోజుల్లోనే పోరాటం చేశారని తెలిపారు. ప్రభుత్వం కూడా అటువంటి మహనీయులను స్మరించుకుంటూ వారి అడుగు జాడల్లో నడవాలని కోరుకుంటుందని, ఆ దిశగా అధికారులు నడవాలని కోరారు. కొప్పల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ జి.వెంకట నాయుడు, సంఘం డైరెక్టర్ కె.మధుసూధనరావు, పువ్వల లావణ్య, కాపు కార్పొరేషన్ డైరెక్టర్, బీసీ సంఘ నాయకులు గబ్బాన సత్తిబాబు తదితరులు మాట్లాడుతూ దేశానికి, సమాజానికి పూలే అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో డిఆర్ఒ కె.హేమలత, కెఆర్ఆర్సీ ప్రత్యేక ఉప కలెక్టర్ పి.ధర్మచంద్రారెడ్డి, బిసి సంక్షేమ అధికారి ఇ.అప్పన్న, డిఎంహెచ్ఒ డాక్టర్ ఎస్.భాస్కరరావు, జిల్లా వ్యవసాయ, పశు సంవర్ధక శాఖాధికారి కె.రాబర్ట్ పాల్,డా. ఎస్.మన్మథరావు, డిఆర్‌డిఎ పీడీ ఎం.సుధారాణి, ఇతర జిల్లా అధికారులు, బీసీ సంఘ నాయకులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

పూలే సాక్షిగా బిసి మంత్రికి అవమానం

మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా అధికారులు ముద్రించిన ఫ్లెక్సీలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, ఉత్తరాంధ్ర బిసి నేత కింజరాపు అచ్చెన్నాయుడు ఫోటో లేకపోవడం చర్చనీయాంశమైంది. ప్రోటోకాల్ నిబంధనల ప్రకారం జిల్లా ఇంఛార్జి మంత్రిగా కింజరాపు అచ్చెన్నాయుడు ఫొటోను మొదటి వరుసలో పెట్టాలి. కానీ ఆయన ఫొటో లేకుండా గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణితో పాటు మిగిలిన ముగ్గురు ఎమ్మెల్యేల ఫొటోలు మాత్రమే ఉన్నాయి. జిల్లా అధికారులు ఎవరి ఆదేశాల మేరకైనా అలా చేశారా, పొరపాటున ఆవిధంగా కటౌట్ ముద్రించారా అనేది ప్రశ్నార్థకంగా మారింది.

కలెక్టరేట్ వద్ద కటౌట్‌లో ఇన్‌ఛార్జి మంత్రికి దక్కని చోటు



ఇన్‌ఛార్జి ఫొటో లేకుంటే కలెక్టరేట్ వద్ద ఏర్పాటుచేసిన ఫ్లెక్సీ

మంత్రి, ఎమ్మెల్యే విడివిడిగా నివాళ్ళు

మహాత్మా జ్యోతిరావుపూలే జయంతి సందర్భంగా శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఆవరణలో పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ కార్యాలయం వద్ద పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. పూలే విగ్రహానికి మంత్రి సంధ్యారాణి, జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ ముందుగా పూలమాల వేసి నివాళులర్పించారు. మంత్రి సంధ్యారాణి నివాళులర్పించే సమయానికి స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర హాజరు కాలేదు. ఆమె నివాళులర్పించిన తరువాత విజయచంద్ర తన అనుచరులతో కలిసి పూలే విగ్రహానికి నివాళులర్పించారు. అంతే కాకుండా పూలే జయంతి సందర్భంగా బిసి సంక్షేమ శాఖ ఏర్పాటు చేసిన ఉపకరణాల పంపిణీ కార్యక్రమంలో మంత్రితో కలిసి ఎమ్మెల్యే పాల్గొనలేదు. బిసి లబ్ధిదారులకు వేర్వేరు ఉపకరణాలను సంధ్యారాణి, కలెక్టర్ అందజేశారు. అదే సమయంలో ఎమ్మెల్యే బోనెల అక్కడే వున్నా ఆ కార్యక్రమంలో పాల్గొనకపోవడం చర్చనీయాంశ మైంది. మంత్రి సంధ్యారాణి, ఎమ్మెల్యే విజయచంద్ర మధ్య విభేదాలు తారాస్థాయికి చేరినట్లు టిడిపి నాయకులు, కార్యకర్తల మధ్య గుసగుసలు వినిపించాయి. కొద్ది నెలల క్రితం వరకు మంత్రి, ఎమ్మెల్యే మధ్య సత్సంబంధాలు వుండేవి. పూలే జయంతి వేడుకల్లో వారిద్దరూ కలెక్టరేట్ ప్రాంగణంలో ఉన్నా విడివిడిగా నివాళులు అర్పించిన తీరు ఇద్దరు అధికారపార్టీ నేతల మధ్య ప్రచ్ఛన్న యుద్ధానికి అద్దం పడుతోంది.

గృహ నిర్మాణాలకు అధిక ప్రాధాన్యత : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో చేపడుతున్న గృహ నిర్మాణాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, ఇచ్చిన లక్ష్యాలను నిర్దేశిత సమయంలోగా పూర్తిచేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం తన క్యాంపు కార్యాలయం నుంచి పలు అంశాలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మండలంలో నెలకు 1,000 గృహాలు పూర్తి చేయాలని లక్ష్యాలను నిర్దేశించామని, ఇందులో కనీసం 500 గృహాలైన పూర్తిచేయాలని స్పష్టం చేశారు. మే నెలాఖరుకు 1600 గృహాలు పూర్తిచేసేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని, ప్రతి మండలంలో వారానికి వంద గృహాలు పూర్తయితే గానీ అనుకున్న లక్ష్యాలను సాధించలేరని చెప్పారు. పిఎంఎవై 2.0 కింద లబ్దిదారులకు అవసరమైన కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల మంజూరులో తహశీల్దార్లు ఉదాసీనత వహిస్తున్నారని, ఇలా కొనసాగితే ఉపేక్షించబోమని హెచ్చరించారు. మంగళవారం నాటికి లబ్దిదారులకు అవసరమైన పత్రాలను తహశీల్దార్లు మంజూరుచేయాలని ఆదేశించారు. చెత్త నుంచి సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని మండల ప్రత్యేక అధికారులను ఆదేశించారు. అనీమియా యాక్షన్ కమిటీలు నిర్వహించి వాటిలో ప్రత్యేక అధికారులు పాల్గొనాలని తెలిపారు. అలాగే అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలు వయసుకు తగిన బరువు, ఎత్తు, నాణ్యమైన పౌష్టికాహారం, గర్భిణీలకు, బాలింతలకు ఇస్తున్న టిహెచ్ఎర్ సక్రమంగా ఇస్తున్నదీ, లేనిదీ వంటి అంశాలను పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు. వేసవి దృష్ట్యా జిల్లాలో ఎక్కడా నీరందని గ్రామాలు ఉండరాదని, సమస్యలు రాక మునుపే ముందస్తు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమస్య తలెత్తకుండా ముందే తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. స్థానిక ఎంపిడిఒ, గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు దీనిపై అప్రమత్తంగా ఉంటూ ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లాలో 950 గ్రామాలు హైరిస్క్ గ్రామాలుగా ఉన్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి తెలిపారని, ఆయా గ్రామాల్లో దశల వారీగా స్ప్రేయింగ్ ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. మే 1 నుంచి తొలి దశ జియ్యమ్మవలస, కురుపాం, కొమరాడ, పాచిపెంట, సీతంపేట మండలాల్లోని స్ప్రేయింగ్ చేయించాలని సూచించారు. ఆయా తేదీల్లోని గ్రామాల్లో ముందుగా చాటింపు వేయించి, ప్రజలు సహకరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో సబ్ కలెక్టర్లు అశుతోష్ శ్రీవాస్తవ, సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, డిఆర్ఒ కె.హేమలత, గృహ నిర్మాణ సంస్థ పీడీ పి.ధర్మచంద్రారెడ్డి, లీడ్ బ్యాంక్ మేనేజర్ ఎన్.విజయ్‌స్వరూప్, డిఎల్డిఒలు, తహశీల్దారులు, ఎంపిడిఒలు, హౌసింగ్ డిఇ, ఎఇలు పాల్గొన్నారు.

'మన ఊరు బడిని రక్షించుకుందాం'

ప్రజాశక్తి - సీతానగం

మన ఊరు బడిని రక్షించుకుందామని, మోడల్ స్కూల్లో ఏర్పాటు చేయాలని సిపిఎం మండల కార్యదర్శి రెడ్డి ఈశ్వరరావు డిమాండ్ చేశారు. ఇందుకు సంబంధించిన గోడపత్రికను శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో విడుదల చేశారు



మన ఊరిబడిని కాపాడుకుందాం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన విద్యా విధానం పేరుతో 3,4,5 తరగతులను విలీనం చేయడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. దీనివల్ల పేద విద్యార్థులను విద్యకు దూరం చేయమేనన్నారు. తక్షణమే ఈ విధానాన్ని రద్దు చేసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిచో ఈ విద్యా విధానాలకు వ్యతిరేకంగా జరిగే పోరాటాల్లో పాల్గొంటామన్నారు. కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు జి.వెంకటరమణ, బి.అప్పారావు, ఆర్.రాము, సిహెచ్ కృష్ణ పాల్గొన్నారు.



జి.శివడ- రాముడుగూడ రోడ్డును ప్రారంభిస్తున్న మంత్రి సంధ్యారాణి

సాధారణ ప్రసవాలే లక్ష్యంగా సేవలందించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మాతా, శిశు ఆరోగ్య శ్రేయస్సుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు పేర్కొన్నారు. ఆశా నోడల్ అధికారులకు స్థానిక ఎన్జీఒ హోమ్‌లో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డాక్టర్ భాస్కరరావు పలు ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. మాతా, శిశు ఆరోగ్యానికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని, గర్భిణీ నమోదు చేసినప్పటి నుండి ప్రసవానంతరం వరకు పూర్తి స్థాయిలో ఆరోగ్య తనిఖీలు, వైద్య పరీక్షలు, నెల వ్యవధిలో రెండు డోసుల టిడి ఇంజక్షన్లు, ప్రతిరోజూ ఐరన్, కాల్షియం మాత్రలు, నిర్దేశించిన కాల వ్యవధిలో కనీసం నాలుగు తనిఖీలు తప్పనిసరి అని తెలిపారు. గర్భిణీల్లో ఆరోగ్య సమస్యలు సత్వరమే గుర్తించి, మెరుగైన వైద్య సేవలు అందించాలని, సురక్షిత ప్రసవమే ధ్యేయంగా కృషి చేయాలని అన్నారు. సాధారణ ప్రసవాలు పిహెచ్‌సిల్లో జరిగేలా చూడాలన్నారు. గిరిశిఖర, మారుమూల గిరిజన గ్రామాల్లో గర్భిణీలను నెల/రెండు నెలలు ముందుగానే గర్భిణీ వసతి గృహాల్లో చేర్చాలన్నారు. పిల్లలకు షెడ్యూల్ ప్రకారం టీకాలు పూర్తి చేయాలన్నారు. రక్తహీనతగా గుర్తించిన గర్భిణీల హీమోగ్లోబిన్ శాతం వృద్ధి చెందేలా పర్యవేక్షించాలన్నారు. వేసవి జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. మాతా, శిశు ఆరోగ్య సేవలన్నీ ఎప్పటికప్పుడు పోర్టల్స్, యాప్‌లో ఆన్లైన్ నమోదు చేసి ప్రగతి నివేదికల పురోగతికి కృషి చేయాలని, మాతా శిశు మరణాల నివారణే లక్ష్యంగా పని చేయాలని అన్నారు. అనంతరం ఆశా కార్యకర్తలకు ఆరోగ్యశాఖ పంపిణీ చేసిన యూనిఫాం (ఏకరూపు దుస్తులను)ను ఆయన ప్రోగ్రాం అధికారులతో కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఐఒ డాక్టర్ ఎం.నారాయణరావు, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ టి.జగన్మోహనరావు, డాక్టర్ రఘుకుమార్, డిపిహెచ్ఎన్ఒ ఉషారాణి, డిపిఒ లీలారాణి, డిసిఎం విజయలత, డెమో సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ అధ్యక్షులు సురేష్

డోలీ మోతల్లేకుండా చూడడమే లక్ష్యం

మంత్రి సంధ్యారాణి

ప్రజాశక్తి - కురుపాం

గిరిజన గ్రామాలన్నింటికీ పక్కా రహదారి సౌకర్యం కల్పించి డోలీ మోతల్లేని గ్రామాలుగా చూడడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర గిరిజన సంక్షేమ, స్త్రీ, శిశుసంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. మండలంలోని జి.శివడ నుంచి రాముడుగూడ వరకు రూ.90 లక్షలతో నిర్మించిన రహదారి, రూ.2 కోట్లతో రాముడుగూడ నుంచి కిడవాయి వరకు నిర్మించిన మరో రహదారిని మంత్రి ప్రారంభించారు. ఉపాధిహామీ మెటీరియల్ కాంపోనెంట్ కింద రోడ్లు నిర్మించారు. 72 రోడ్లు వేయడానికి రూ.99 కోట్లు మంజూరయ్యాయని మంత్రి తెలిపారు. ఈ మండలంలో 195 అనుసంధానం లేని గ్రామాలున్నాయని, దశల వారీగా కనెక్టివిటీ ఇవ్వనున్నట్లు ఆమె తెలిపారు. రాష్ట్రంలో హాస్టల్ నిర్వహణ, మౌలిక సదుపాయాల కోసం రూ.156 కోట్లు మంజూరు చేసినట్లు ఆమె తెలిపారు. జూన్ 1 నుంచి అమ్మకు వందనం, మే నెలాఖరు నుంచి సుఖీభవ అమలు చేస్తామని మంత్రి చెప్పారు. గిరిజన యువతకు స్వయం ఉపాధి కోసం ట్రైకార్ రుణాలు అందజేస్తామని, బీసీలకు శిక్షణ ఇప్పిస్తామని తెలిపారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 950 అంగన్‌వాడీ పోస్టులను మెరిట్ ఆధారంగా భర్తీ చేస్తామని ఆమె అన్నారు. గిరిజన ప్రాంతాల అభివద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుదని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక ఆగదీశ్వరి అన్నారు. అనంతరం గర్భిణీలకు సామూహిక సీమంతాలు జరిపించారు. కార్యక్ర మంలో జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్, పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, సబ్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డి, అధికారులు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేశ్ చంద్రదేవ్, పలువురు కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

త్వరలో ఏనుగుల సమస్య పరిష్కరిస్తాం

ఏనుగులను ప్రస్తుతం ఉన్న ప్రాంతాల నుంచి త్వరలో తరలిస్తామని మంత్రి సంధ్యారాణి తెలిపారు. పంటలకు భారీ నష్టం వాటిల్లిందని, అటవీశాఖను కూడా చూస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి సమస్యను తీసుకెళ్లామన్నారు. ఏనుగులను తరలించేందుకు కుంకీ ఏనుగులు వస్తాయని ఆమె తెలిపారు అలాగే కురుపాం, పాలకొండ నియోజకవర్గాల అవసరాలకు అనుగుణంగా తోటపల్లి కాలువను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని, పూర్ణపాడు టాబేసు వంతెన పనులు త్వరలో పూర్తికానున్నాయని ఆమె పేర్కొన్నారు.

కష్టపడి చదివితే విజయం మీదే: ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ఎన్ని సంవత్సరాలు మీరు చదివారన్నది కాదు ఒకే ఒక్క ఏడాది కష్టపడి, ఇష్టపడి చదివితే విజయం మీ సొంతమవుతుందని స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర విద్యార్థులకు సూచించారు. స్థానిక శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ చింతల చలపతిరావు ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన డిగ్రీ విద్యార్థుల ఫేర్వెల్ ఫంక్షన్‌కు ఎమ్మెల్యే విజయచంద్ర ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన పలు సాంస్కృతిక నృత్యాలను ఆయన తిలకించి వారిని అభినందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ డిగ్రీ అయిపోయిందని ధీమాతో ఉండకూడదని, మీకు చాలా ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని అన్నారు. డిగ్రీ అయిపోయిన నిరుద్యోగ యువతకు ప్రభుత్వం చాలా అవకాశాలు కల్పిస్తుందని, మీరంతా లక్ష్యాలను నిర్దేశించుకొని ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. మీరు స్థిరపడితే తల్లిదండ్రులకు, చదివిన కళాశాలకు, గ్రామానికి మంచి పేరు ప్రఖ్యాతలను తీసుకొచ్చిన వారవుతారని అన్నారు. అనంతరం ప్రిన్సిపల్, విద్యార్థులు, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బెలగాం జయప్రకాష్ నారాయణ(జయబాబు), పట్టణ టిడిపి అధ్యక్షులు గుంట్రెడ్డి రవికుమార్, ఐటిడిపి అరకు పార్లమెంట్ అధ్యక్షులు కోరాడ నారాయణరావు, కౌన్సిలర్లు మంత్రి రవికుమార్, బడే గౌరునాయుడు, మజ్జి పారినాయుడు, బొచ్చ ఆనందరావు, టిడిపి నాయకులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు..

జిఒ 35ను తక్షణమే రద్దు చేయాలి

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

పంచాయితీ రాజ్ శాఖలో ప్రభుత్వం చేపట్టిన పాలనా సంస్కరణ వల్ల పరిపాలన అధికారులకు తీరని అన్యాయం జరుగుతుందని నాన్ గెజిటెడ్ గవర్నమెంట్ అధికారుల సంఘం జిల్లా అసోసియేట్ అధ్యక్షులు సురేష్ అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో నిర్వహించిన ఆ సంఘ సమావేశంలో ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడారు. ఇటీవల పంచాయతీ రాజ్ శాఖలో ప్రభుత్వం ఇటీవల చేపట్టిన పాలనా సంస్కరణలను ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఉద్యోగుల సంఘం స్వాగతిస్తుందన్నారు. అదే సమయంలో శుక్రవారం ప్రభుత్వము విడుదల చేసిన జిఒ35లో జిల్లా పరిషత్, మండల పరిషత్‌లో పనిచేస్తున్న పరిపాలన అధికారులకు ఎంపిడిఒ ప్రమోషన్ పదోన్నతి కోటాలో తీరని అన్యాయం జరిగిందని అన్నారు. గతంలో ఫీడర్ కేటగిరిని బట్టి ఎంపిడిఒ ఉద్యోగోన్నతిలో తమకు 34% కేటాయింపు జరిగిందన్నారు. అదే సందర్భంలో ఇఒపిఆర్‌డిలకు 33శాతం, నేరుగా ఎంపిడిఒల నియామకానికి 30శాతం, ఇతరులకు 3శాతం కేటాయింపులు జరిగియన్నారు. సంస్కరణలో భాగంగా ఎంపిడిఒలకు నేరుగా నియామక కోటాను రద్దు చేసినందున తమకు కేడర్ స్ట్రెంగ్త్ ప్రకారం వారి పదోన్నతిలో 50శాతం కేటాయించాల్సి ఉండగా కేవలము 34శాతం మాత్రమే కేటాయింపు చేయడం దారుణమని అన్నారు. దీనివల్ల రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా పరిషత్, మండల పరిషత్‌లో పని చేసున్న పరిపాలన అధికారులకు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లకు, రికార్డు అసిస్టెంట్లకు, ఆఫీస్ సబర్డినేట్లకు తీరని నష్టం జరుగుతుందని, ఆందోళన వ్యక్తం చేశారు. దీన్ని సవరించి తమకు సహజ న్యాయ సూత్రం ప్రకారం రావాల్సిన పదోన్నతి కోటాను (50శాతం) కేటాయించాల్సిందిగా డిమాండ్ చేశారు. సమావేశంలోఎన్‌జిజిఒ సంఘం కార్యదర్శి ఎ.సురేష్, పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు సిహెచ్.మురళీ, కార్యదర్శి వి రాంబాబు, ట్రెజరర్ పీఎం ఆర్ కుమార్, అసోసియేట్ అధ్యక్షులు శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు శ్రీరాములు, ఆర్గనైసింగ్ సెక్రటరీలు నాలి అర్జునరావు, బి.లక్ష్మణ్ కుమార్, ఏవోలు లు జివి రమణ మూర్తి, బివి. నాగ భూషణరావు పార్వతీపురం, కురుపాం యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

ప్రజాశక్తి - పాచిపెంట

ఉపాధి హామీ చట్టాన్ని పకడ్బందీ గా అమలు చేయాలని సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మండలంలోని కొటికిపెంట పంచాయితీ నీలయమ్మ చెరువు వద్ద కోడి కాలవలస, గరిల్లవలస గ్రామాల ఉపాధికూలీలతో ఆయన మాట్లాడారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా సాధించుకున్న ఉపాధి చట్టాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని విమర్శించారు. పని చేసిన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల్లేవని ఆవేదన వ్యక్తం చేశారు. నీలయమ్మ చెరువు వద్ద ఎండలకు తట్టుకోలేక సొంతంగా చలువ పందిర్లు వేసి ఎండలకు ఉపయోగించుకుంటున్నారని అన్నారు. ముఖ్యంగా తాగునీటి సౌకర్యం కూడా కల్పించడం లేదన్నారు. మూడేళ్ల కిందట గుణపాలు, పారలు అందించారని, ఇప్పుడు ఇవ్వడంలేదని అన్నారు. పనిచేసిన కూలీలకు సకాలంలో బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని అవినీతికి తావు లేకుండా కూలీలకు గిట్టుబాటు డబ్బులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రెండు పూటలా పనులు చేసే పద్ధతి మార్చుకోవాలన్నారు. 200 రోజులు పని దినాలు పెంచాలని, రూ.300కు తక్కువ లేకుండా కూలి చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు మాదల సత్యవతితో పాటు జి.సావిత్రి, పైల లక్ష్మణరావు, బదనాన్న అప్పలస్వామి, సుంకి జన్ని, రవి తదితరులు పాల్గొన్నారు.



కూలీలతో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు ఈశ్వరరావు

ఇళ్లు మంజూరు చేయాలని మంత్రికి వినతి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

దశాబ్దాలుగా గిరిజన ప్రాంతాల్లో గిరిజనులతో కలిసి నివసిస్తున్న ఒసి, బిసి, ఎస్సీ నిరుపేదలకు ప్రధానిమంత్రి ఆవాస యోజనాలో భాగంగా పక్కా గృహాలు మంజూరు చేసేలా ప్రభుత్వం చొరవ చూపాలని ఏజెన్సీ కాపు సంఘ అధ్యక్షుడు కొనిశ మన్మథరావు ఆధ్వర్యంలో బిసి నాయకులు రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖామంత్రి గుమ్మడి సంధ్యారాణికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒసి, బిసి, ఎస్‌సిల్లో నిరుపేదలు పక్కా గృహాల్లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దీనిపై తక్షణమే ప్రభుత్వం స్పందించి చొరవ చూపాలని కోరారు. వినతిని అందజేసిన వారిలో జెడ్పీ హైస్కూల్ చైర్మన్ సొంటేన రాజేష్, నితీష్, చారి తదితరులు ఉన్నారు.

పంచాయతీ కార్యదర్శుల మండల కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని 35గ్రామపంచాయతీల కార్యదర్శుల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా శుక్రవారం ఎన్నుకున్నారు. మండల కార్యదర్శుల సంఘం అధ్యక్షులుగా రామవరం పంచాయతీ కార్యదర్శి ఆదిమూలం శశిభూషణ్ రావు, వైస్ ప్రెసిడెంటుగా బగ్గందొరవలస పంచాయతీ సెక్రటరీ కర్రి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా కృష్ణారాయపురం కార్యదర్శి జి శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీగా గాదెలవలస కార్యదర్శి బడే మనోహర్, కోశాధికారిగా పెదంకలం కార్యదర్శి గౌరీశ్వరి, గౌరవ అధ్యక్షులుగా వినోగాలి పంచాయతీ కార్యదర్శి పెంట తిరుపతిరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కొత్త కార్యవర్గాన్ని ఎంపిడిఒ పి త్రివిక్రమరావు, ఇఒపిఆర్డి కె కుమార వర్మ, ఏవో ఎంఎల్ఎన్ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు అభినందించారు.



పోషణ పక్వాడ్‌పై అంగన్‌వాడీలకు అవగాహన కల్పిస్తున్న సిడిపిఒ రంగలక్ష్మి

పోషణ పక్వాడ్‌పై అవగాహన

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో సిడిపిఒ పి.రంగలక్ష్మి ఆధ్వర్యంలో పోషణ పక్వాడ్ పక్షోత్సవాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఈనెల 8 నుంచి 22వ తేదీ వరకు అంగన్వాడీ కేంద్రాల్లో పోషణ పక్వాడ్ వక్షోత్సవాలు తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. పౌష్టికాహారం గురించి వివరించారు. పోషణ పక్వాడ్ ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించారు. గ్రామాల్లో తల్లులకు, పిల్లలకు అవగాహన కల్పించి పౌష్టికాహారం అందించాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా పిల్లలకు, గర్భిణీలకు, బాలింతలకు పౌష్టికాహారం తప్పనిసరిగా అందాలన్నారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు లావణ్య, స్వాతి, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాలు ఇంకెప్పుడు ?

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక నగర పంచాయతీలో ప్రతివేసవిలో చలివేంద్రాలు ప్రారంభించడం ఆనవాయితీ. అయితే వేసవి చివర్లో చలివేంద్రాలు పెట్టి చేతులు దులుపుకోవడం అలవాటుగా మారింది. ఈ ఏడాది కూడా చలివేంద్రాలు ఇంతవరకు ఏర్పాటు కాలేదు. గత నెల 28న నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశంలో చలి వేంద్రాల ఏర్పాటుకు తీర్మానించారు. మూడు చలివేంద్రాలు ఏర్పాటుకు లక్ష రూపాయలు కేటాయించారు. ఓ పక్క ఎండలు మండుతున్నా ఇంత వరకూ చలివేంద్రాలు ఏర్పాటు కాలేదు. ప్రధాన కూడళ్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉన్నప్పటికీ ఇంత వరకూ ఏ చర్యలు తీసుకోలేదు. దీంతో ప్రజల నుంచి తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి.



వర్థంతి సభలో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు ప్రసాదరావు

సింహాచలం ఆశయ సాధనకు పనిచేయాలి

ప్రజాశక్తి - భామిని

బడుగు బలహీన వర్గాలు, కార్మిక వ్యవసాయ కూలీల హక్కులు కోసం బర్రి సింహాచలం ఎన్నో పోరాటాలు చేశారని, ఆయన ఆశయ సాధనకు మనమంతా కృషి చేయాలని సిపిఎం నాయకులు పోలాకి ప్రసాదరావు అన్నారు. భామినిలో బర్రి సింహాచలం పదో వర్ధంతి కె.మిన్నరావు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. తొలుత సింహాచలం చిత్రపటానికి సిపిఎం నాయకులు, సానుభూతిపరులు, కుటుంబ సభ్యులు పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ మండలంలో సిపిఎం అభివృద్ధికి సింహాచలం చేసిన సేవలు మరువలేనివన్నారు. ఆయన ఆశయం సాధన కోసం అందరూ కలిసికట్టుగా ముందుకు వెళ్లాలని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి జగన్, నాయకులు సిర్ల ప్రసాద్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నులకజోడులో యాంటీ లార్వా స్ప్రే

ప్రజాశక్తి - భామిని

మండలంలోని బత్తిలి పిహెచ్సి పరిధిలోని నులకజోడులో దోమల నివారణకు చేపడుతున్న యాంటీ లార్వా స్ప్రేను, ఫ్రైడే, డ్రైడే కార్యక్రమాన్ని శుక్రవారం డిప్యూటీ డిఎంహెచ్వో విజయ పార్వతి పరిశీలించారు. గ్రామంలో జ్వర లక్షణాలతో బాధపడుతున్న వారిని పరిశీలించి అందుతున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే, వ్యాధుల బారినపడకుండా ఉంటామని గ్రామస్తులకు సూచించారు. అనంతరం బత్తిలి పిహెచ్‌సిని పరిశీలించారు. ప్రభుత్వ వైద్య కేంద్రాలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందించే బాధ్యత మనపై ఉందని వైద్య సిబ్బందికి తెలిపారు. కార్యక్రమంలో బత్తిలి పిహెచ్‌సి వైద్యులు కె.దామోదరరావు, వైద్య సిబ్బంది ఉన్నారు.

జీడి పిక్కలు కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి - కొమరాడ

గిరిజన రైతులు పండించిన జీడిపిక్కలను కొనుగోలు చేయాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గత ఏడాది కూడా వెలుగు అధికారులు జీడిపిక్కలు కొంటామని చెప్పేరే తప్ప కొమరాడ మండలంలో ఒక్క జీడి పిక్క కూడా కొనుగోలు చేయని పరిస్థితి ఉందని అన్నారు. అలాగే కొమరాడలో జీడిపిక్కల ప్రాసెస్ యూనిట్‌ను ఏర్పాటు చేస్తామని పరిశీలించి వెళ్లారు తప్ప ఆ తర్వాత పూర్తిగా కనిపించని పరిస్థితి నెలకొందన్నారు. విడివికెలకు అతి తక్కువ నిధులు ఇచ్చిన పిమ్మట అందులో మహిళలకు టెంట్లు, వంట సామాగ్రి, కుట్టు మిషన్లు కొనుగోలు చేస్తే మరి జీడి పిక్కలకు, కొండ చీపుర్లు చింతపండు గిరిజనులు పండించిన పంటలు కొనడానికి ఇంకా ఎక్కడ డబ్బులు ఉంటాయని ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కొనుగోలు చేయాలని కోరారు.

రోగులకు వితరణ

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని పెదపెంకిలో విలేజ్ క్లినిక్ సమీపాన అంబేద్కర్ విగ్రహం వద్ద ఫైలేరియా రోగులకు వైద్యసిబ్బంది ట్రబ్బులు, టవళ్లు, సబ్బు మొదలగునవి స్థానిక సర్పంచ్ పాపారావు, పెద్దలు గోపాలరావు, యూత్ ప్రెసిడెంట్ ఈర్ల సంజీవ్ నాయుడు, పంచాయతీ సభ్యులు హేమంత్ కుమార్, అప్పలనాయుడు చేతులు మీదుగా అందజేశారు. కార్యక్రమంలో పెదపెంకి విలేజ్ క్లినిక్ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



ఫైలేరియా రోగులకు ట్రబ్బులు అందజేస్తున్న సర్పంచ్, గ్రామపెద్దలు

ఘనంగా పూలే జయంతి వేడుకలు

ప్రజాశక్తి - విలేకరులు

మహాత్మ జ్యోతిరావు పూలే జయంతోత్సవాలు జిల్లాలోని పలు విద్యా సంస్థల్లోనూ, ప్రైవేట్ కార్యాలయాల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల వేసి ఘనంగా నివాళు అర్పించారు.

కురుపాం : అంటరానితనం, కుల వ్యవస్థ నిర్మూలనతో పాటు మహిళోద్ధరణకు కృషి చేసిన మహోన్నత వ్యక్తి బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి జ్యోతిరావు పూలే అని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. శుక్రవారం స్థానిక జ్యోతిరావుపూలే పాఠశాలను సందర్శించి, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి పాఠశాలలో భోజనాలు, సమస్యలు గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

సాలూరు: బడుగు వర్గాల ఆశాజ్యోతి జ్యోతిరావు పూలే అని మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర అన్నారు. పూలే జయంతి సందర్భంగా ఆయన నివాసంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం రాజన్నదొర మాట్లాడుతూ పూలే సామాజిక కార్యకర్తగా చేసిన సేవలు ఆదర్శప్రాయమని చెప్పారు. కార్యక్రమంలో పట్టణ వైసిపి అధ్యక్షులు వంగపండు అప్పలనాయుడు, జెసిఎస్ కన్వీనర్ గిరిరఘు, వైసిపి నాయకులు ఎం.మధుసూధనరావు, హరి బాలాజీ, ఎం.అప్పారావు పాల్గొన్నారు.

సీతంపేట : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు ప్రిన్సిపల్ సుశాంత్ జన, వైస్‌ప్రిన్సిపల్ ప్రభాకరరావు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు సందర్భంగా మాట్లాడుతూ జ్యోతిరావు పూలే గురించి విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురంరూరల్: స్థానిక టిడిపి కార్యాలయంలో జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను టిడిపి అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ బొబ్బిలి చిరంజీవులు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా జ్యోతిరావుపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అంతరం బీసీల హక్కుల పరిరక్షకుడు ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పలువురు మాజీ ప్రజా ప్రతినిధులు, టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో....

మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో చిత్రపటానికి జిల్లా పోలీసు అధికారులు పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఎఆర్ డిఎస్పీ థామస్ రెడ్డి మాట్లాడుతూ అంటరానితనం, కుల వ్యవస్థ నిర్మూలన మరియు మహిళాభ్యున్నతికి కృషి చేసిన మహోన్నత వ్యక్తి పూలే అని కొనియాడారు. కార్యక్రమంలో ఆర్ ఆర్ఐలు రాంబాబు, నాయుడు, ఆర్ఎస్ఐలు, ఎస్పీ, డిసిఆర్బి అధికారులు, సిబ్బంది, స్పెషల్ పార్టీ, పోలీసు కార్యాలయం, సిబ్బంది పాల్గొన్నారు.

కొమరాడ : జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలతో నివాళ అర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు కొల్లి సాంబమూర్తి మాట్లాడుతూ సమాజంలో కుల, లింగ వివక్షతకు తావు లేకుండా అన్ని వర్గాలకు విద్య అందాలని, విద్య ద్వారానే బలహీన వర్గాలు సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని భావించిన వ్యక్తి పూలే అని అన్నారు. ఇలాంటి సందర్భంలో ఈరోజు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాల వల్ల దళిత, గిరిజనులపైనా, విద్యార్థులపైన మహిళలు పైన జరుగుతున్న దాడులను ఎదుర్కొనేలా జ్యోతిరావు పూలే స్ఫూర్తితో యువతీ యువకులు ముందుకు రావాలని కోరారు . ఈ కార్యక్రమంలో గిరిజన సంఘము నాయకులు లక్ష్మయ్య విద్యార్థులు పాల్గొన్నారు.



పూలే జయంతి సభలో మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర



పూలే చిత్రపటం వద్ద నివాళ్లు అర్పిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి



స్మార్ట్‌మీటర్లు వద్దంటూ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

స్మార్ట్ మీటర్లు వద్దు : సిపిఎం

ప్రజాశక్తి - బలిజిపేట

స్మార్ట్ మీటర్లు రద్దు చేసి, పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని సిపిఎం నాయకులు బొద్దాన భానుమూర్తి, నల్ల ఈశ్వర రావు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ భారాలు వేసే స్మార్ట్ మీటర్ల పై ప్రజలంతా పోరాడాలని పిలుపునిచ్చారు. స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని, కరెంట్ చార్జీలు తగ్గించాలంటూ స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో గోడపత్రికలను శుక్రవారం ఆవిష్కరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు భారాలు వేయబోమని చెప్పి ప్రజలను నమ్మించి నేడు అధికారంలోకి వచ్చాక బాదుడే బాదుడుగా అన్ని రకాల నిత్యావసర సరుకులు ధరలు పెంచేలా నిర్ణయాలు చేసిందని విమర్శించారు. ఇప్పటికే పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలతో సతమతమవుతున్న ప్రజలపై స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసి మరింత ఆర్థిక భారాలు వేసే ప్రయత్నం చేపడుతుందని, ఇది చాలా దుర్మార్గమని మండిపడ్డారు. కావున రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై మోపిన ట్రూ అప్ ఛార్జీలను ఉపసంహరించాలని, సెకీ ఒప్పందాలను రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లు పెట్టే ఆలోచన విరమించుకోవాలని డిమాండ్ చేశారు కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు గేదెల సత్యనారాయణ, మండల నాయకులు యమ్మల మన్మధరావు, పీస వెంకటస్వామి, పాలీల అప్పారావు, తదితరులు పాల్గొన్నారు

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరండి

ప్రజాశక్తి - సీతానగరం

అన్ని మౌలిక వసతులు, నాణ్యమైన విద్యను లభించే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులను చేరాలంటూ విద్యార్థుల తల్లిదండ్రులను స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ పిఒ డి.రామకృష్ణ, ఒఎస్ఒ ఎ.అచ్చం నాయుడు కోరారు కోరారు. ఈ మేరకు మండలంలోని బూర్జ, చల్లంనాయుడువలసలో శుక్రవారం ఇంటింటికి వెళ్లి విద్యార్థిని, తల్లిదండ్రులను కలిసి వారు మాట్లాడారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తమ పిల్లలను చేర్పించాలని, ప్రభుత్వం కల్పించే రాయితీలు, పథకాలు పొందాలని కోరారు. అంతేకాక తమ కాలేజీలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించనున్నట్టు తెలిపారు. ప్రభుత్వం ఉచితంగా అందజేసే విద్యను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భామినిలో ఏసు సన్నిధి యాత్ర

ప్రజాశక్తి -భామిని

పాస్టర్లు సంజీవరావు, ప్రతాప్ ఆధ్వర్యంలో భామినిలో శుక్రవారం ఏసు శిలువ మార్గం కార్యక్రమం నిర్వహించారు. ఏసు వేషధారణలో బాలకృష్ణ సిలువను, ఏసు దైవ సన్నిధికి చేరే అంతిమ యాత్ర సన్నివేశాలను కన్నులకు కట్టినట్టు ప్రదర్శించారు. క్రైస్తవ సోదరులు ఏసు ప్రభు సూచించిన దైవ మార్గాన్ని అనుసరించి స్వర్గలోక ప్రాప్తి పొందాలని పాస్టర్ క్రైస్తవ సోదరులకు సూచించారు. కార్యక్రమంలో క్రైస్తవ సోదరమాలలు ధరించిన వారు ఎత్తున పాల్గొన్నారు. క్రైస్తవ సంఘం సభ్యులు, సర్పంచులు లోపింటి రాజేష్, కవిటి రాజు, చింతాడ చరణ్, కాంతారావు పాల్గొన్నారు.



గొల్లవానివలసలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి ప్రభాకరరావు

అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రస్తుతం నిర్మిస్తున్న పక్కా గృహాలు త్వరితగతిన పూర్తయ్యేలా గృహ నిర్మాణ శాఖ అధికారులు చర్యలు చేపట్టాలని మన ఇల్లు -మన గౌరవం ప్రత్యేక అధికారి ఒ.ప్రభాకరరావు అన్నారు. మండలంలోని గొల్లవానివలసలోని కాలనీలో పక్కా గృహాల నిర్మాణాలను శుక్రవారం హౌసింగ్ ఎఇ వంగపండు అఖిల్ నాయుడుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రస్తుతం ఇంటి నిర్మాణాలు చేపడుతున్న లబ్ధిదారులకు తగు సూచనలు, సలహాలు అందజేశారు. అనంతరం ప్రత్యేక అధికారి ప్రభాకరరావు మాట్లాడుతూ గొల్లవానివలస కాలనీలో నిర్మిస్తున్న పక్కా గృహాలను నిర్దేశించిన సమయంలోగా పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నామని అన్నారు. లబ్ధిదారులకు ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లించాలని ఎఇకి సూచించారు. ఈ పరిశీలనలో హౌసింగ్ వర్కు ఇన్‌స్పెక్టర్ మరిశర్ల భాస్కరరావు వున్నారు.

870 లీటర్ల సారా స్వాధీనం

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని సుందరయ్య గూడలో ఆకస్మిక దాడులు నిర్వహించి 870 లీటర్ల నాటు సారాతో పాటు 1250 లీటర్ల బెల్లం ఊటను స్వాధీనం చేసుకొని ధ్వంసం చేసినట్లు ప్రొహిబిషన్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి.శ్రీనాథుడు తెలిపారు. అంతర్ జిల్లా దాడుల్లో భాగంగా పాలకొండ ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ సిబ్బంది, శ్రీకాకుళం జిల్లా కొత్తూరు ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ సిబ్బందితో కలిసి శుక్రవారం ఆకస్మిక దాడులు చేసినట్లు చెప్పారు. దాడుల్లో నాటు సారాయి తయారుచేస్తున్న సుందరయ్యగూడకు చెందిన పూయకు మురళి బిడ్డ, ఆదినారాయణ, పూయక సంజీవ రావును అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. 870 లీటర్ల నాటు సారాను, సారా తయారీకి ఉపయోగించే 1250 లీటర్ల బెల్లం పులుపులను ధ్వంసం చేశామన్నారు. అలాగే వారికి బెల్లం సరఫరా చేసిన కొత్తూరు మండలంలోని లబ్బ గ్రామానికి చెందిన బెల్లం వ్యాపారి జామి సురేష్‌పై కూడా కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. నవోదయం 2.0లో భాగంగా నాటు సారా తయారుచేసినా, అమ్మినా కఠిన చర్యలు తీసుకుంటామని అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎఎస్ దొర తెలిపారు.

ఈ దాడుల్లో పాలకొండ మొబైల్ పార్టీ సిఐ మురళి, కొత్తూరు సిఐ కిరణ్మయి, పాలకొండ ఎస్సైలు జి.ఫణింద్రబాబు, ఎల్.తిరుపతి రావు, ఎ.వాసుదేవరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



బెల్లం ఊటలను స్వాధీనంచేసుకున్న ఎక్సైజ్ అధికారులు

మహిళ స్నేహ పూర్వక పంచాయతీగా సీతంపేట

ప్రజాశక్తి -సీతంపేట

మండలంలో సీతంపేట గ్రామపంచాయతీ మహిళా స్నేహపూర్వక గ్రామపంచాయతీగా ఎంపికైంది. ఈ సందర్భంగా డిఎల్‌డిఒ వివి గోపాలకృష్ణ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా సాధికారత స్వావలంబన సాధించిన రోజే నిజమైన మహిళా స్నేహపూర్వక గ్రామపంచాయతీగా సీతంపేట వర్ధిల్లుతుందని తెలిపారు. ఇంకా గ్రామపంచాయతీ అన్ని విధాలా అభివృద్ధి చెందాలని అన్నారు. అన్ని కార్యక్రమాల్లో ముందంజలో ఉండాలన్నారు. జిల్లాలో సీతంపేట గ్రామ పంచాయతీ ఎంపిక కావడం అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎ.కళావతి, ఎన్ఐఆర్‌డి కన్సల్టెంట్ కె.నాగరాజు, డిఎల్‌పిఒ రాంప్రసాద్, ఎంపిడిఒ కృష్ణారావు, ఇఒపిఆర్‌డి కె.సత్యం, పంచాయతీ కార్యదర్శి బి.రామకృష్ణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రక్తహీనత నివారణే ధ్యేయం

ప్రజాశక్తి - గరుగుబిల్లి

గర్భిణీలు, బాలింతల్లో రక్త హీనత నివారణే ప్రభుత్వ ధ్యేయమని ఈ మేరకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందజేస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణీలు, బాలింతలు విధిగా తీసుకోవాలని మండల ప్రత్యేక అధికారి, ఆర్‌డబ్ల్యుఎస్ జిల్లా అధికారి ఒ.ప్రభాకరరావు అన్నారు. గరుగుబిల్లి అంగన్వాడీ కేంద్రం-2ను శుక్రవారం ఆయన ఇఒపిఆర్‌డి ఎల్.గోపాలరావుతో కలిసి పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రంలోని పలు రికార్డులను పరిశీలించడంతో పాటు, కేంద్రానికి సరఫరా చేస్తున్న స్టాకు వివరాలను పరిశీలించారు. అనంతరం ప్రత్యేక అధికారి ప్రభాకరరావు మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలకు పోషకాహారంపై మరింత అవగాహన కల్పించాలని అంగన్వాడీ కార్యకర్త పల్ల కృష్ణవేణికి సూచించారు. అంగన్వాడీ కేంద్రం ఆవరణలోని ఖాళీ ప్రదేశంలో కాయగూరలు, ఆకుకూరల పెంపకం చేపట్టాలని పేర్కొన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో ప్రతినెలా 5న తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి ప్రీస్కూల్ నిర్వహణపై అవగాహన కల్పించాలని తెలిపారు.

కులగణన తర్వాతే వర్గీకరణ చేయాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

కులగణన తర్వాత ఎస్సీ వర్గీకరణ చేయాలని శుక్రవారం స్థానిక రెల్లి కులస్తులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఎస్సీ వర్గీకరణలో రెల్లి జాతి వారికి మిగతా జాతులతో పాటు సమన్యాయం చేయాలని, కుల గణన అయిన తర్వాత వర్గీకరణ చేయాలని, జిల్లాను యూనిట్‌గా పరిగణించి వర్గీకరణ చేయాలని, లేనిచో ప్రస్తుత ఎస్సీ వర్గీకరణ తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. వర్గీకరణ పట్ల ప్రస్తుత ప్రభుత్వం జిల్లాను యూనిట్‌గా చేసి ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని అన్నారు. డప్పు వాయిద్యాలతో పాటు ప్లకార్డులతో భారీ ప్రదర్శన చేసి నినాదాలు చేశారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి ప్రధాన రహదారి మీదుగా తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి కార్యాలయ సీనియర్ సహాయకులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రెల్లి సామాజికవర్గ నాయకులు రత్నాకర్, అమర్నాథ్, బాబురావు, ప్రవీన, జీవరత్నం, వరద, ఆనందరావు, యువకులు ,మహిళలు, పాల్గొన్నారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉండేందుకు స్థానిక ఎస్సై జి.కళాధర్, సిబ్బంది పర్యవేక్షించారు.

ద్విచక్ర వాహనం అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

జియ్యమ్మవలస మండలం పిప్పల భద్రకు చెందిన ఎం.భూషణ్ బొబ్బిలి నుంచి పార్వతీపురం మీదుగా చినమేరంగి వెళ్తుండగా పార్వతీపురం మండలం నర్సిపురం టిబిఆర్ సినిమా థియేటర్ సమీపాన వాహనం అదుపుతప్పి తీవ్ర గాయాల పాలయ్యాడు. స్పందించిన స్థానికులు 108 వాహనంలో జిల్లా ఆసుపత్రికి తరలించారు. గుర్తుతెలియని వాహనం గుద్ది వెళ్లి పోయినట్లుగా కొంతమంది అనుమానిస్తున్నారు. ఈ విషయమై రూరల్ ఎస్సై సంతోషి కుమారి మాట్లాడుతూ సిసి కెమెరా అలా పరిశీలనలో ప్రమాదం ఏ విధంగా జరిగింది విచారణ జరిపి తెలుసుకుంటామని, ప్రస్తుతానికి గాయపడ్డ వ్యక్తి స్పృహలోనే ఉన్నట్టు శుక్రవారం ఆమె తెలిపారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

ప్రజాశక్తి - వీరఘట్టం

ప్రకృతి వ్యవసాయం రైతులకు ఎంతో లాభదాయకమని పట్టణ టిడిపి అధ్యక్షులు జామి లక్ష్మీనారాయణ అన్నారు. శుక్రవారం స్థానిక ఎపిఎన్ఎఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రైతుల అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయం సాగు చేయడం వల్ల తక్కువ పెట్టుబడితో పాటు దిగుబడి కూడా బాగా వస్తుందని అన్నారు. అలాగే శ్రమ కూడా తగ్గుతుందన్నారు. ప్రకృతి సాగు చేసిన పంటలకు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉందన్నారు. అలాగే ప్రభుత్వం కూడా ప్రభుత్వ వ్యవసాయ సాగును ప్రోత్సహిస్తుందన్నారు. కావున ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయ విధానంలో ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక వ్యవసాయ అధికారి జే సౌజన్య, ఏపీ సీఎన్ఎఫ్ మారుతి సింహాచలం, గ్రామీణ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

సమస్యల పరిష్కారంపై అధికారులు దృష్టి పెట్టాలని, వాటిని మండల స్థాయిలోనే పరిష్కరించాలని మండల ప్రత్యేక అధికారి, జిల్లా ప్రణాళిక అధికారి పి.వీర్రాజు అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో మాట్లాడారు. తాగునీరు, పారిశుద్ధ్యం, గృహ నిర్మాణం, విద్యుత్ తదితర వాటికి సంబంధించి దరఖాస్తులు ఎక్కువ వస్తున్నాయని, సత్వరమే పరిష్కరించేందుకు చొరవ చూపాలని అన్నారు. ముఖ్యంగా ఎండలు తీవ్రత అధికంగా ఉండడం వల్ల గ్రామాల్లో ఎక్కడైనా బోరు బావులు మరమ్మతులైతే తక్షణమే మరమ్మతులు చేపట్టేందుకు కృషి చేయాలి అన్నారు. వేసవి కారణంగా విద్యుత్ సరఫరా హెచ్చుతగ్గుల వల్ల మోటర్లు మొరాయించే ప్రమాదం ఉందని, వీటిని దృష్టిలో పెట్టుకొని, రక్షిత మంచినీటి పథకాల వద్ద అదనంగా రెండు, మూడు మోటర్లు సిద్ధంగా ఉంచుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇంకా ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ బి.వెంకటరమణ, విద్య, గృహ నిర్మాణ, పంచాయతీరాజ్, వెలుగు, ఉపాధి, ఆర్‌డబ్ల్యుఎస్, ఐసిడిఎస్, వ్యవసాయ, శాఖలకు సంబంధించిన అధికారులు పాల్గొన్నారు.



వెంకటరాయిని కోనేరు చుట్టూ ఉన్న చెత్తాచెదారం

కానరాని పారిశుధ్య పర్యవేక్షణ

ప్రజాశక్తి - పాలకొండ

స్వచ్ఛ పాలకొండ చేస్తామంటూ ప్రతిజ్ఞలు చేసిన నగర పంచాయతీ అధికారులు, పాలకులు పట్టణ పారిశుధ్యంపై దృష్టిపెట్టిన దాఖలాల్లేవు. పూర్తిగా పారిశుధ్యాన్ని గాలికి వదిలేశారు. దీంతో ఎక్కడికక్కడ రోడ్లపై చెత్తా, చెదారం దర్శనమిస్తుంది. వెంకటరాయిని కోనేరు చుట్టూ అపారిశుద్ధ్యం తాండమోడుతుంది. అలాగే కోమటిపేట జంక్షన్, లుంబురు వారి వీధి తదితర ప్రాంతాల్లో రోడ్డుపైనే చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. అయినప్పటికీ నగర పంచాయతీ అధికారులు పట్టించుకునే దాఖలాల్లేవు. తాత్కాలిక డంపింగ్ యార్డ్ ఉన్నప్పటికీ రోడ్లపై చెత్త ఎందుకు దర్శనమిస్తుందో తెలియడం లేదని ప్రజలు అసంతృప్తి చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టిసారించి పట్టణంలో పారిశుధ్యం మెరుగునకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చేపల పెంపకంపై అవగాహన

ప్రజాశక్తి -భామిని

ప్రధానమంత్రి ధాత్రి ఆభజన జాతీయ ఉత్కర్ష అభియాన్ కార్యక్రమంలో భాగంగా మత్స్యకారుల ఆర్థిక అభివృద్ధికి, మత్స్య సాగు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అందిస్తున్న పలు అంశాలపై చేపలు పెంపకం చేపడుతున్న గిరిజనులకు పాలకొండ మత్స్య అభివద్ధి అధికారి డి.గోపీకృష్ణ శుక్రవారం అవగాహన కలిగించారు. చేపలు పట్టుటకు అవసరమైన వలలు, రవాణాకు అవసరమైన ద్విచక్రవాహనాలు, 90శాతం సబ్సిడీతో మొబైల్ ఫిష్ యూనిట్లు ఏర్పాటుకు మండలంలో గుర్తించిన 19 గ్రామాలకు చెందిన స్వయం సహాయక సంఘాలు, వందన్ వికాస్ కేంద్రాలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు పాలవలస, నల్లరాయి గూడ, మనం కొండ గ్రామాల్లో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మనుమకొండ సర్పంచ్ నిమ్మల కేశవ, పాలవల సర్పంచ్ బిడ్డకు తమ్మారావు, భామిని మండలం ఫిషరీస్ అసిస్టెంట్ కె.ఆదినారాయణ పాల్గొన్నారు.